01ATP24F_01ATP24F.qxd 24-04-2026 PM 11:38 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 25 ఏప్రిల్ 2026 పేజీలు : 04

# వైభవంగా సత్యసాయి ఆరాధన మహోత్సవం

- మహా నారాయణ సేవలో పాల్గొన్న 45 వేల మంది భక్తులు - సాయి సేవలు ప్రపంచానికి ఆదర్శం - ఎమ్మెల్యే





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ,హిమవాహిని రత్నాకర్ , భక్తులకు వస్త్రాలను అందిస్తున్న ఆర్జె రత్నాకర్.






నారాయణ సేవలో పాల్గొన్న వేలాదిమంది భక్తులు , సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం.

**పుట్టపర్తి రూరల్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**
నిస్వార్థమైన సేవతో విశ్వవ్యాప్తంగా భక్తులను సంపాదించుకున్న భగవాన్ సత్యసాయి బాబా 15వ ఆరాధన మహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు వేదమంత్రాలతో ప్రశాంతి నిలయంలో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం పంచరత్న కృతి అను వాయిద్య భరితమైన సంగీత కార్యక్రమాన్ని సంగీత కళాశాల బృందం వీనుల విందుగా ప్రదర్శించారు. ఈసందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఎస్ఎస్ నాగానందు మాట్లాడుతూ భగవాన్ భౌతిక రూపాన్ని విడిచిపెట్టినప్పటికీ ఆయన దివ్య స్ఫూర్తి కుల మత జాతీయత అనే సరిహద్దులను అధిగమించి ప్రతి హృదయంలోనూ నివసిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే మాట్లాడుతూ అవతార సందేశం శాశ్వతమైనదని భగవాన్ కేవలం ఒక చారిత్రక ఆధ్యాత్మిక వ్యక్తి మాత్రమే కాదని, నిస్వార్థ ప్రేమ సేవ ద్వారా వ్యక్తమయ్యే నిరంతర దివ్య శక్తి అని ఉద్ఘాటించారు. తిరిగి సాయంత్రం ప్రఖ్యాత్ గాయనీలుగా, గాన ప్రవీణ బిరుదు



అన్నదానం చేస్తున్న మాజీ మంత్రి పల్లె

పొందిన కిరణ్ ,నివిల బృందం అద్భుతమైన సంగీత కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమం అత్యంత మనోహరంగా చూపరులను మంత్రముగ్ధులను చేసింది. వారు ప్రదర్శించిన కర్ణాటక సాంప్రదాయ సంగీత జతులను వాయిద్య కారులు తమ వాయిద్యాలపై ప్రదర్శిస్తూ ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది సత్యసాయి భక్తులు, సాయి విద్యార్థులు పాల్గొన్నారు. నరులసేవయే నారాయణుని సేవ అని భావించి సత్యసాయి ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న 45 వేల మంది భక్తులకు అన్న ప్రసాదమును, వస్త్రధానమును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్ తో పాటు, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని, వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆర్జే రత్నాకర్ మాట్లాడుతూ సత్యసాయి పై ఉన్న భక్తితో 45 వేల మందికి పైగా సాయి భక్తులు ఈ నారాయణ సేవలో పాల్గొన్నారన్నారు. సాధన నుండి ఆరాధన వైపు సాయి భక్తులు అన్వయించిన తీరును తెలియజేశారు. వైద్య సేవలను సైతం అత్యాధునిక యంత్ర సహాయంతో మారుమూల గ్రామాలకు సైతం అందించమన్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ సత్యసాయి సేవలు ప్రపంచానికి ఆదర్శమని, సాయి చూపిన సేవా బాటలో అందరూ పయనించాలని తెలిపారు. అంతకువ ఐనుపు ప్రశాంత నిలయంలోని సత్యసాయి బాబా మహాసమాధుని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, సేవా సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష పాండే, ట్రస్టు సభ్యులు నాగనంద్, మోహన్ , రేడియో సాయి డైరెక్టర్ సుందర్ స్వామినాథన్, ఆంధ్ర రాష్ట్ర సేవా సంస్థల అధ్యక్షులు లక్ష్మణరావు తో పాటు వందలాదిమంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

# బిగుసుకుంటున్న హనీ ఉచ్చు





నిదితులను కోర్టుకు తీసుకు వెళ్తున్న పోలీసులు, పోలీసు అదుపులో ఉన్న వైసిపి నేత నరేంద్ర రెడ్డి

- విచారణలో ట్విస్ట్ మీద ట్విస్ట్
- గలీజు దందాలో పొలిటికల్ ఎంట్రీ
- కస్టడిలో కింగ్ పిన్ నరేంద్రరెడ్డి
- క్యూలో మరో 40 మంది ఇంటి దొంగలు
- ఆ నలుగురికి 14 రోజుల రిమాండ్
- ఆ సీఐలకు వీఆర్ తోనే సరిపెడతారా..?
- ఇంతకీ నరేంద్ర రెడ్డిది ఏ పార్టీ ?

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త**
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హాని ట్రాప్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. పూటకో ట్విస్ట్ మీద ట్విస్ట్...పోలీసుల విచారణ మరింత స్పీడ్ అందుకుంది. ఈ గలీజ్ దందాలో ముందుగా తెరపైకి హనీట్రాప్‌ముఠానేఅని భావించారు. కానీ తెరవెనుక వీరితోకీలక సంబంధాలు పెట్టుకున్న ఇంటిదొంగలుకూడా ముందు వరుసలోఉన్నారు. 30 నుండి 40 మంది దాకా వీరితో ప్రత్యక్ష సంబంధాలుఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో బహిర్గ తమైనట్లు తెలిసింది. ఈ హనీ క్రీడలో ఇప్పటికే ఇద్దరు సిఐలు ఔట్ అయ్యారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, రాప్తాడు సీఐ శ్రీహర్షకు కర్నూలు రేంజ్ డీఐజీ ఎదుట హాజరుకావాలని ఉత్తర్వులుజారీ అయ్యాయి. ఈకేసులో ఇంకా కొందరు సిఐలు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పదులసంఖ్యలో కానిస్టేబుళ్ళు ఉన్నట్లు విచారణ అధికారులు ఆధారాలు సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొందరు లేడిడాన్ చిన్ని అలియాస్ రంగమ్మ నాయుడుతో కలిసి పంచాయతీలు, సెటిల్మెంట్లు చేయడం, మరికొందరు ఆంటీలు అమ్మాయిలతో కలిసి విలాసాలకోసం టూర్‌లకు వెళ్లడం జరిగినట్లు బహితమైంది. అనంతపురం రూరల్ రాప్తాడు ఇటుకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది ముఠా సభ్యులతో మాట్లాడిన ఫోన్ సంభాషణ ఆడియో బయటకు పొక్కింది. వీటిని ఆధారంగా చేసుకుని అధికారులు విచారణ వేగవంతం చేశారు. దీంతో పోలీసు వర్గాల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. హనీఉచ్చు ఎవరెవరి మెడకు చుట్టుకుంటుందోనని ఖాకీలు కలవరపాటుకు గురవుతున్నారు. తమ పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోననే చర్చ పోలీస్ శాఖలో హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ కేసులో సంబంధాలు ఉన్న వారికి పోలీస్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న భయాందోళనలు వారిలో వెంటాడుతూనే ఉన్నాయి. ఈ అంశం ప్రస్తుతం అనంతపురం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈకేసులో పొలిటికల్ ఎంట్రీ కావడంతో ఒక్కసారిగా అందరూ షాక్ అయ్యారు. గతంలో అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గా పనిచేసిన వైసీపీ నేత నరేంద్ర రెడ్డి పేరు కొత్తగా తెరపైకి వచ్చింది. దీంతో హనీ దందా కేసు రాజకీయ రంగు పులుముకోవడంతో కొత్త మలుపు తిరిగింది. నరేందర్ రెడ్డి ముఠా సభ్యులకు కీలక పాత్ర పోషించినట్లు పోలీసుల విచారణలో వెల్లడింది. ఈపాపంలో కింగ్‌పిన్‌గా వ్యవహరించిన నరేంద్ర రెడ్డి వారితో సన్నిహితంగా ఉండి వారి కార్యకలాపాల్లో ఈయన హస్తంఉన్నట్లు అంచనాకు వచ్చారు. దీంతో పోలీసులు ఈయనను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అయితే పోలీసులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. నరేంద్ర రెడ్డి పాత్ర ముఠాసభ్యులకు ఏస్థాయిలో ఉందో, సంపన్నుల నుండి నేరుగా ముఠాతో చేతులు కలిపి లక్షణాలు లక్షలు గుంజినట్లు సాగుతున్న ప్రచారం కూడా లేకపోలేదు. ఇదిలా ఉండగా హనీ ట్రాక్ కేసులో మరో నలుగురు నిందితులైన దబ్బర రాజేష్ నాయుడు, చంద్రకళ, జయమ్మ, అనంత కుమారిలను పోలీసులు శుక్రవారం జిల్లా కోర్టు ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి వీరికి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. అయితే ఈ నేరాల్లో కీలక పాత్ర పోషించిన ఆ ఇద్దరు సీఐలను కేవలం వేకెన్సీ రిజర్వ్ తోనే సరిపెట్టి చేతులు దులుపుకున్నారనే అపవాదులు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నేరాలు చేసిన నిందితులకు భారతీయ శిక్షాస్మృతి సమానంగా ఉంటుందని, మరి పోలీసు అధికారులకు ఈ చట్టాలు వర్తించవా.? అనిప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. దీన్ని బట్టిచూస్తే చట్టాలను తమచుట్టాలులాగా మార్చుకోవడం పోలీసు శాఖకి చెల్లుబాటు అవుతుందని ప్రచారం జోరుగా సాగుతోంది. తప్పుచేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందే నిన్న భయంతో భవిష్యత్తులో ఎలాంటి నేరాలు జోలికి వెళ్లకుండా ఉండేందుకుశిక్షలు పౌరులతో సమానంగా అందరికీ ఒకేలావర్తించేలా చర్యలుతీసుకోవాలని భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పోలీసులు అదుపు లోఉన్న రుద్రంపేట మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి ఏపార్టీకి చెందినవారన్నది క్లారిటీ లేదు. శుక్రవారం వైసీపీకి చెందిన నగర మాజీమేయర్‌వసీం,వైసిపి నగర్‌అధ్యక్షునితో మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో నరేందర్‌రెడ్డికి గతనాలుగేళ్ల కిందటే వైసిపి దూరం పెట్టిందనిచెప్పారు. మీడియాలో వైసిపినాయకుడని పదేపదే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నరేందర్ రెడ్డి కి వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటిప్రసాద్ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ఆయనదగ్గరికివెళ్లి శుభాకాంక్షలు చెప్పాడని, అతను టిడిపిపార్టీకిచెందిన వాడుగా వ్యాఖ్యానించారు. అయితే మరోవైపు తెలుగుదేశం పార్టీ నాయకులు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వైసిపికిచెందిన నరేందర్‌రెడ్డిని పార్టీకిదూరం పెట్టామంటూ వైసీపీనాయకులుచేసిన వ్యాఖ్యలను టిడిపి నాయకులు ఖండించారు. ఇలా ఇరు పార్టీల వారు నరేందర్ రెడ్డి తమ పార్టీకి చెందిన వాడు కాదంటూ పరస్పర వ్యాఖ్యానాలు చేయడంతో పొలిటికల్ హీట్ ఎక్కింది.

# గ్రామాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యం ..

- ప్రతి గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దాలి .. - పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్






జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్నీ ప్రారంభిస్తున్న దృశ్యం, సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**శ్రీ సత్యసాయి జిల్లా, ఏప్రిల్ 24, ప్రభాతవార్త ప్రతినిధి**
గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లోని పి జి ఆర్ ఎస్ హాల్‌లో 17వ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశిష్టమైన స్వామిత్వ కార్యక్రమం, జలధార, జలకళ వంటి పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామస్థాయిలో పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్య రంగాల్లో మరింత మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి కోసం అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం సత్యసాయి జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రెటరీలను పంచాయతీ కార్మికులను జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సుమలత ప్రశంసించి వారికి ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రంతోపాటు మెమెంటో బహూకరించి శాలువతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుమలత, జిల్లా వైద్యాధికారి పీరోజ్ బేగం, డి ఎల్ పి ఓ సమత,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంకిత భావంతో విధులు నిర్వర్తించండి

ఐసిడిఎస్ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్






ఐసిడిఎస్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ , సమావేశంలో పాల్గొన్న అంగన్వాడి కార్యకర్తలు

**అనంతపురం కలెక్టరేట్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త**
ఐసిడిఎస్ లో విధులు నిర్వర్తించండి అధికారులు ,సిబ్బంది క్షేత్రస్థాయిలో అంకితభా వంతో శాఖాపరమైనసేవలందించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో ఐసిడిఎస్ శాఖ అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా వైద్యుల ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం స్టంటింగ్ సమస్య ఉన్న ప్రతి పిల్లవాడిని ఎన్ ఆర్ సికు తప్పనిసరిగా సిఫారసు చేయాలని ఆదేశించారు. ఐసిడిఎస్ ద్వారా అమలవుతున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎన్ ఆర్ సి కి సిఫార్సు చేసిన పిల్లలు తప్పనిసరిగా అక్కడ ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత సి డి పి ఓ మరియు సూపర్వైజర్లపై ఉంటుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే పోషన్ ట్రాకర్ మరియు గ్రోత్ మానిటరింగ్ కు సంబంధించిన డేటాను 100 పూర్తి చేయాలని ఎక్కడ కూడా లోటుపాట్లు లేకుండా ఖచ్చితమైన డేటాను ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైతే అంగన్వాడీ వర్కర్లకు సెక్టార్ సమావేశాల్లో ప్రత్యేక సమయం కేటాయించాలని ఆదేశించారు. ప్రతినెలా లాగానే వచ్చే నెలలో కూడా సెంటర్ లను రాండంగా సందర్శించాలని ఆ సందర్భంగా సూపర్వైజర్లు మరియు సిడిపివోలు పిల్లల బరువులను కొలిచి సంబంధిత రిపోర్టులను అదే రోజున సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తాను కూడా క్షేత్రస్థాయిలోపర్యటిస్తానని పిల్లలబరువు విషయంలో ఆ జాగ్రత్తలు చేసినట్లు రుజువైతే అట్టివారిపై కఠిన చర్యలు తెప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.రానున్న సమావేశంలోగా జిల్లాలో డ్రాపౌట్ విద్యార్థులు మరియు ఆధార్ కార్డు లేని పిల్లలను తిరిగి స్కూల్‌లో చేర్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుని, అందుకు సంబంధించిన సదుపాయాలు సిద్ధం మిగతా 4 లో....

# అసంపూర్తి భవనం..అవస్థల వైద్యం..!

- భవనం కాదు..బాధ పోదు..! - పీహెచ్‌సీల్లో 'సలహా'కు మంగళం - మెరుగైన వైద్యానికి 70 వేల మంది ఎదురుచూపులు





యాడికిః నూతన భవనంపై నిర్లక్ష్యం...నెరవేరని లక్ష్యం..! , రాయలచెరువుః భవనం అసంపూర్తి..సేవలకెప్పుడు ప్రాప్తి..!

**యాడికి(తాడిపత్రి), ఏప్రెల్24,ప్రభాతవార్తః**
పేదలకు బాసటగా నిలవాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వసతుల లేమి అనే అనారోగ్యం వెంటాడుతోంది. పెరిగిన రోగులకు అనుగుణంగా ధర్మాసుపత్రుల్లో సరిపడా వసతులు కల్పించకుండా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రేయింబవళ్లు అత్యవసర సేవలు అందించాల్సిన వైద్యాలయాలు దేవుళ్లు లేని కోవెలలుగా మారిపోయాయి. అత్యవసర సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల గడప తొక్కితే తమ ప్రాణం గాలిలో దీపమేననే భావనకు పేదలు వచ్చేస్తున్నారు. సరైన వసతుల్లేక గ్రామీణ వైద్యం గాడి తప్పినా పాలకుల గుండె కరగడం లేదు. తాడిపత్రి పట్టణం తర్వాత ఆ స్థాయిలో వైద్య సేవలు అవసరమైన ప్రాంతం యాడికి మండలమే. రెండు భారీ సిమెంటు పరిశ్రమలు, 35కి పైగా స్లేటెట్, డోలమైట్ పరిశ్రమలు, ఆరు నూనె శుద్ధి కర్మాగారాలు, 26 డోలమైట్ గనులు, 10 వేలకు పైగా చేనేత మగ్గాలు వంటి వాటిపై ఆధారపడి జీవనం చేసే కార్మికులు, మిగతా 3 లో....





యాడికిసేవలకు తప్పని ఎదురు చూపులు , రాయలచెరువు: అరకొర వసతుల మధ్యనే సిబ్బంది ఇబ్బంది

# గత ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి దగ్గుపాటికి పని చేసింది వాస్తవం కాదా

- గత నాలుగేళ్లుగా నరేందర్‌రెడ్డి వైసిపిలో లేరు - మాజీ మేయర్, వైసిపి నగరాధ్యక్షులు

**అనంతపురం సిటీ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**
గత సార్వత్రిక ఎన్నికల్లో రుద్రం పేట నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యే దగ్గుపాటికిపని చేసింది వాస్తవం కాదా అని మాజీమ ఏయర్ వసీం, వైసిపి నగరాధ్యక్షులు చింత సోమశేఖర్‌రెడ్డిలు ప్రశ్నించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మహ్మద్ వసీం మాట్లాడుతూ..హనీ ట్రాప్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్న రుద్రంపేట నరేందర్‌రెడ్డి వైసిపికి సంబంధం లేదని స్పష్టం చేశారు. గత నాలుగేళ్ల క్రితమే రుద్రంపేట నరేందర్‌రెడ్డి పార్టీకి దూరంగా ఉంచడం జరిగిందన్నారు. గత ఎన్నికల సమయంలో టిడిపి అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ నరేందర్‌రడ్డి ఇంటికి వెళ్లారని, ఎన్నికల తర్వాత దగ్గుపాటి ఇంటికి నరేందర్‌రెడ్డి వెళ్లి సన్మానంచిన ఫోటోలను ఈసందర్భంగా చూపించారు. వైసిపి ఐదేళ్లపాలనలోనగరంలో ప్రశాంతంగా ఉందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగరంలో



విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటితో నరేందర్‌రెడ్డి ఉన్న ఫోటోను చూపుతున్న వైసిపినేతలు

అరాచకాలు, ఆకృత్యాలు అధికమయ్యాయని విమర్శించారు. దౌర్జన్యాలు, భూ కబ్జాలు పెరిగిపోయాయని, ఏడు మహానగరాల్లో మాత్రమే కనిపించే హనీ ట్రాఫ్ వంటివి వెలుగు చూశాయన్నారు. పోలీసులు కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ చేశారు. వైసిపి నగరాధ్యక్షులు చింత సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో చోటు చేసుకున్న హనీ ట్రాప్ ఘటనను ఛేదించిన జిల్లా ఎస్పీ జగదీష్‌కు అభినందనలు తెలియజేశారు. గతంలో జిల్లాలో రైతు ఆత్మహత్యలు మాత్రమే ఉండేవని, నేడు హనీ ట్రాప్‌లో చిక్కుకుని ఆత్మహత్యకు పాల్పడే పరిస్థితి వచ్చిందన్నారు. అయితే గతంలో వైసిపిలో ఉన్న రుద్రంపేట నరేందర్‌రెడ్డి గత నాలుగేళ్లుగా వైసిపికి దూరంగా ఉన్నారని, ఇదే అంశాన్ని కొన్ని పత్రికలు, కొన్ని ఛానెళ్లలో చూపించారన్నారు. నేడు ఇలాంటి ఘటన జరగగానే అతను వైసిపి వ్యక్తిఅంటూ ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు ఎవరైనా ఉంటే పోలీసులు విచారణలో వారిని కూడా గుర్తించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. నగరంలో అసాంఘీక కార్యకలాపాలు చేస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రారంభానికి నోచుకోని రైతు సేవా కేంద్రం



రైతు సేవ కేంద్రం భవనం చుట్టూ కంపచెట్లు పెరిగిన దృశ్యం

**కంబదూరు ,ఏప్రిల్ 24, ప్రభాతవార్త**

మండల కేంద్రంలో రైతుల సేవల కోసం నిర్మించిన రైతు సేవా కేంద్రం ప్రారంభానికి నోచుకోక పోవడంతో స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.21 లక్షల వ్యయంతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టగా, ప్రస్తుతం దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి.అయితే నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు అధికారికంగా ప్రారంభించలేదు. కార్యాలయం చుట్టూ కంపచెట్లు పెరగడంతో పరిసర ప్రాంతాలు అడవిని తలపిస్తున్నాయి. దీంతో రైతులకు అందాల్సిన సేవలు ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం రైతు సేవా కేంద్రానికి సంబంధించిన ఎరువులు, ఇతర వ్యవసాయ సామాగ్రిని వ్యవసాయ శాఖ కార్యాలయంలోనే నిల్వ ఉంచుతున్నారు. భవన నిర్మాణం పూర్తయ్యి రైతు సేవా కేంద్రం ప్రారంభమైతే రైతులకు ఒకే చోట సిబ్బంది సేవలు అందుబాటులోకి రావడంతో పాటు, ఎరువులు, విత్తనాలు వంటివి సులభంగా లభించే అవకాశం ఉందని రైతన్నలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు.

# ఈనెల 26న ఉచిత సున్తి



మీడియాతో మాట్లాడుతున్న మత పెద్దలు

**రాయదుర్గం ఏప్రిల్ 23 ప్రభాతవార్త**

రాయదుర్గం పట్టణంలోని అంజుమన్ అజ్మతుల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 26న అనగా సోమవారం ఉచిత సున్తీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ పెద్దలు పేర్కొన్నారు ఈ మేరకు శుక్రవారం మదరాసాల్లో సమావేశం ఏర్పాటు చేసి విషయాన్ని వెల్లడించారు ఈ కార్యక్రమాన్ని బళ్ళారి రోడ్ లో ఉన్న మదరస జామియా అన్వర్ ఒలోమ్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ శర్మాస్ మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే క్యాంపులో 150 మంది పేద పిల్లలకు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు ఈ ఏడాది మెరుగైన వైద్య సేవలతో సున్తీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు సున్తీ కార్యక్రమం అనంతరం సున్తీ చేయించుకున్న బాలులకు ఉచిత ఆహార నిత్యావసర సరుకులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు సున్తీ చేయించుకునేవారు 50 రూపాయలు చెల్లించి టోకెన్ తీసుకోవాలని కోరారు.

# జింకల నీలమ్మ మృతికి నివాళులర్పించిన పాలబండ్ల శ్రీరాము

**ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ. 10,000 తక్షణ ఆర్థిక సాయం అందజేత**

**బ్రహ్మసముద్రం ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కష్టాల్లో ఉన్న కార్యకర్తలను కంటికి రేప్పలా కాపాడుకుంటామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మరోసారి నిరూపించారు. బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త జింకల నిలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, నిలమ్మ కుటుంబానికి అండగా నిలవాలని పార్టీ నాయకులను ఆదేశించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆదేశాల మేరకు టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు శుక్రవారం పాలవెంకటాపురం గ్రామానికి చేరుకున్నారు. మృతి చెందిన నిలమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే గారి తరపున రూ. 10,000 నగదును తక్షణ ఆర్థిక సాయంగా పాలబండ్ల శ్రీరాములు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను ఎమ్మెల్యే గారు తన కుటుంబ సభ్యుడిలా భావిస్తారని నిలమ్మ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుంపల్లిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

**జై భీమ్ నినాదాలతో మారుమ్రోగిన అనుంపల్లి గ్రామం**

**శెట్టూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న దళిత నాయకులు ఎమ్మెస్ హనుమంత రాయుడు

మండల పరిధిలోని అనుంపల్లి గ్రామంలో శుక్రవారం భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుక లు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామమంతా జైభీమ్ నినాదాలతో మార్మోగింది. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా దళిత నాయకులు ఎంఎస్ హనుమంత రాయుడు, ఉపాధ్యాయులు గోపాల్, రాజన్న, గ్రామ పెద్దలు గంగప్ప, ఈరన్న, మాజీ సర్పంచ్ సురేంద్రబాబు, మాజీఎంపీటీసీ క్రిష్టప్ప,బాబు,తిమ్మారెడ్డి, సురేష్, రమేష్,నవీన్,లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాలనుకొనియాడుతూ సమానత్వం, న్యాయం, హక్కుల పరిరక్షణపై ఆయనచేసిన కృషి అపారమనిపేర్కొన్నారు. అంబేద్కర్ చూపినమార్గంలో నడవడం ద్వారా మాత్రమే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని నాయకులు పిలుపునిచ్చారు. యువత అంబేద్కర్ సిద్ధాంతాలను అర్థం చేసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థులు, యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.గ్రామ ప్రజలు మహిళలు యువకులు అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాలీసెట్-2026 పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు**

**ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు**



బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తిప్పేస్వామి

**కళ్యాణదుర్గం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**

పాలీసెట్-2026 ప్రవేశ పరీక్షల నిర్వహణకు కళ్యాణదుర్గం కేంద్రంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ తిప్పేస్వామి తెలిపారు. ఏప్రిల్ 25 (శనివారం) ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, అందువల్ల ముందుగానే చేరుకోవాలని సూచించారు. నిబంధనలు కఠినంగా అమలుచేస్తామని, ఒక్కనిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. కళ్యాణదుర్గంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జ్ఞానభారతి జూనియర్‌కళాశాల, శ్రీ వివేకానంద జూనియర్‌కళాశాల, ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 810మంది బాలురు, 575మందిబాలికలు పరీక్షకు హాజరుకానున్నా రు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు నల్ల బాల్ పాయింట్ పెన్, హెచ్‌బి పెన్సిల్, రబ్బరు మాత్రమే తీసుకురావాలని, సెల్ ఫోన్లు, చేతి గడియారాలు సహా ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని తెలిపారు. హాల్‌టికెట్ అందని విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, 10వ తరగతి హాల్ టికెట్, రూ.400 ఫీజుతో బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సంప్రదించి హాల్ టికెట్ పొందవచ్చని సూచించారు.

# భక్తులు బాలాలయము ప్రతిష్టాపనకు తరలి రండి

**డి.హిరెహాళ్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



మురడి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో తాత్కాలికంగ ప్రతిష్టించనున్న బాలాలయము (ఆంజనేయస్వామి) కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి, ఎంపీటీసీ గంగాధర భక్తులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డి.హిరెహాళ్ మురడి ఆంజనేయ స్వామి దేవాలయం ల ఆవరణలో జరగనున్న గర్భగుడి పునర్నిర్మాణం, స్వామివారి ప్రతిష్టాపన కార్యక్రమం, హుండీ లెక్కింపు తదితర అంశాలను ఈవో, ఎంపీటీసీ తెలిపారు. పునర్నిర్మాణంలో భాగంగ ఈనెల 29న 11.17 గంటలకు బాలాలయము ప్రతిష్టాపనకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని, స్వామివారి ఆలయ పునర్నిర్మాణం పూర్తి అయ్యేదాక భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రతిష్టించనున్న బాలాలయము స్వామివారిని దర్శించుకుని పూజలు చేయించాల్సి ఉంటుందని వారు చెప్పారు. నిర్మాణపు పనులు పూర్తి అయినా వెంటనే శ్రీస్వామివారి నిజ విగ్రహ దర్శనమును కల్పించడం జరుగుతుందని వారు తెలిపారు. ఆలయంలో విమాన గోపురం, గర్భాలయం, ఎం ఏ ఎల్ ఈ లాంటి పనులు 50 శాతం పూర్తయ్యాయని అర్థమండపాలను రాతి కట్టడం తో నిర్మించాల్సి వుందని, ఆగమ శాస్త్ర పండితుల లంగా సూచన మేరకు ఈ నెల 29న టేకు కర్రతో స్వామివారి మూర్తిని తయారుచేసి ప్రతిష్టకు సిద్ధం చేయనున్నట్లు వారు చెప్పారు.

# డిపో గౌరవాధ్యక్షులుగా అనందరాజులు

**కనేకల్లు ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



డిపో గౌరవాధ్యక్షులను సన్మానిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఏపీ.పి.టి.డి ఎంప్లాయిస్ యూనియన్ రాయదుర్గం డిపో గౌరవ అధ్యక్షుడిగా కనేకల్లుకు చెందిన ఉప్పర ఆనందరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కనేకల్ క్రాస్ నందు ఆనందరాజు స్వగృహం నందు కలిసి గౌరవప్రదంగా ఆర్టీసీ డిపో యూనియన్ సభ్యులు శుక్రవారం సన్మానించారు, ఇప్పటికైనా కనీసం జిల్లా కేంద్రం నుండి కనేకల్ మండలాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కలిగించేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష,కార్యదర్శులు టి.ఎస్.కే.జిలాన్, సి.రామలింగ మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్.వలి మన ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు వన్నూరు సాబ్, మురళి,మల్లేష్ రెడ్డి తదితరులు పాల్గొని అనందరాజు కి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా భగవాన్ సత్య సాయి బాబా వర్ధంతి వేడుకలు

**బుక్కపట్నం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



భగవాన్ సత్యసాయి బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని తేరు కూడలి నందు భగవాన్ సత్యసాయి బాబా 15వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన శ్రీ సత్య సాయి కళ్యాణమండపం అధ్యక్షులు పట్టాభి నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.సాయంత్రం 5గంటలసమయంలో భగవాన్ సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి సత్య సాయి భజనలు సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా పట్టాభి నాగరాజు మాట్లాడుతూ భగవాన్ సత్యసాయిబాబా శివైక్యం చెంది 15 సంవత్సరాలు గడిచిపోయింది అని, బాబా జ్ఞాపకార్థం ఈకార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈసందర్భంగా భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టాభి కుటుంబ సభ్యులతో పాటు సత్యసాయి భజన మండలి సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జనాభా లెక్కలు 2026 - మీ వివరాలు మీరే నమోదు చేసుకోండి

**రాష్ట్ర ఉత్తమ వినియోగ, సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్ చౌదరి**



ఉత్తమ వినియోగ సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లా కిషోర్ చౌదరి

**కళ్యాణదుర్గం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**

భారత జనాభా లెక్కల సేకరణలో భాగంగా ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్‌లో (Self-Enumeratio) నమోదు చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని రాష్ట్ర ఉత్తమ వినియోగ సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లా కిషోర్ చౌదరి తెలిపారు. ఏప్రిల్ 16, 2026 నుంచి ఈ నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, ప్రజలు అధికారిక వెబ్‌సైట్ https://se.census.gov.in ద్వారా తమ కుటుంబ వివరాలను సులభంగా, సురక్షితంగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ విధానం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు, సమాచార ఖచ్చితత్వం కూడా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# జనగణనపై రేపు టుకే రన్

**హిందూపురం టౌన్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

జనగణన స్వీయ నమోదుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు రేపు హిందూపురం పట్టణంలో టుకే రన్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టుకేరన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొంటారని గాంధీ కూడలి నుండి ప్రారంభమై మేళాపురం తెలుగు తల్లి సర్కిల్ తిరిగి గాంధీ కూడలి వద్ద టుకే రన్ ముగియనుందని తెలిపారు. కార్యక్రమం సందర్భంగా భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు, తాగునీటి మొదలగు ఏర్పాటులను సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, మండల డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, హిందూపురం సిడిపిఓ, మెప్మా సిబ్బంది, వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు,మున్సిపల్‌శాఖ అధికారులు,సిబ్బంది హాజరయ్యారు.

# బీసీ గళం విజయవంతం చేయండి

**పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచం ద్ర**

**పెనుకొండ ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



బీసీ గళం విజయవంతం చేయాలని పిలుపునిస్తున్న దృశ్యం

బీసీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం, రెండేళ్ల గడిచిన నెరవేర్చక పోవడంతో, వైఎస్ ఆర్సిపి ఆధ్వర్యంలో ఈ నెల 26న. అనంతపురంలోని లలిత కళాపరిషత్ వేదికగా, బీసీ గళం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని బీసీలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని మాజీమంత్రి ఉషశ్రీ చరణ్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్రలు పిలుపునిచ్చారు శుక్రవారం పట్టణంలోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో, జిల్లా విస్తృతస్థాయి బూత్ ఏజెంట్ల సమావేశ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తల సమక్షంలో, బిసి గళం పోస్టర్లను విడుదల చేశారు. వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. ప్రభుత్వ కనువిప్పుకోసమే, వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో బీసీగళం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున బీసీలు తరలిరావాలన్నారు . సమస్యల సాధనకై తమ వంతుగా ప్రతి బీసీ బిడ్డ కృషి చేయాలన్నారు. బీసీలు ఐక్యత ప్రభుత్వానికి కనువిప్పుగా మారాలని వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షురాలు మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్, హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్ రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం సమన్వయకర్త దీపిక, మడకశిర సమన్వయకర్త ఈరలకప్ప, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్లు,మండల బూత్ కన్వీనర్లు, పంచాయతీ బూత్ ఏజెంట్లు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఉత్తమ ఎంపీడీవో గా విజయసింహారెడ్డి

**కనేకల్లు ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



ఉత్తమ ఎంపీడీవో గా అవార్డు అందుకుంటున్న కనేకల్ ఎంపీడీవో

పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పనితీరు కలిగిన ఎంపిడిఓలకు, డిప్యూటీ ఎంపిడిఓల కు, పంచాయతీ అభివృద్ధి అధికారులకు ,ఇతరసిబ్బందికి అవార్డులను జిల్లా పరిషత్ లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గిరిజమ్మ ,జడ్పీ సీఈవో నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమ లలో పని తీరు నిర్వహణ పై అధికారులకు సర్టిఫికెట్ లను ఇచ్చారు. ఇందులో కనేకల్ మండలం ఎంపిడిఓ విజయ సింహా రెడ్డి కీ సర్టిఫికెట్ కి ఉత్తమ ఎంపీడీవో గా అవార్డు అందించారు. జిల్లాలో స్వచ్ఛ రథం సేవలోకనేకల్ మండలంనకు ఉత్తమ పనితీరు కలిగిన రాజశేఖర్ కు కూడా సర్టిఫికెట్ ఇచ్చారు. కనేకల్ మండలం నకు ఒకేసారి రెండు ఉత్తమ సర్టిఫికెట్ అందించడంతో ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది ఆనందం వ్యక్తపరిచారు.

# ప్లాస్టిక్ బ్యాగులు వద్దు బట్టల బ్యాగులే ముద్దు...

**గోరంట్ల లో....బెస్ట్ విశ్వ విద్యాలయం విద్యార్థుల ర్యాలీ, బట్టల బ్యాగులు పంపిణీ**



బట్టల బ్యాగులు పంపిణీ చేస్తున్న యూనివర్సిటీ సిబ్బంది

**గోరంట్ల, ఏప్రిల్ 24 ప్రభాత వార్త**




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భవిష్యత్ తరాల వారికి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గిద్దాం.. పర్యావర ణాన్ని కాపాడుదాం.. అంటూ బెస్ట్ విశ్వ విద్యాలయానికి చెందిన విద్యార్థులు శుక్రవారం పట్టణంలో బ్యానర్లు చేతపటుకుని ఊరేగించారు. మండలంలోని కమ్మలవాండ్లపల్లి సమీపం కర్ణాటక సరిహదులోని బెస్ట్ ఇన్నోవేషన్ విశ్వ విద్యాలయంకు చెందిన విద్యార్థులు భూమి(ఎర్త్ డే) దినోత్సవం ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఉద్యమించారు. పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటి హెల్త్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా పట్టణ రహదారి గుండా.. బ్యానరు, పేకార్డు చేతపటుకుని ఊరేగించారు. బస్టాండు కూడలికి చేరుకుని అక్కడకున్న ప్రయాణికులను ఉద్దేశించి ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎవరికి వారు స్వతహాగా ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచించారు. ఇలాగే ప్లాస్టిక్ వాడితే.. పర్యావరణానికి త్రీవంగా ముప్పు వాటిలిల్లుతుందని వెల్లడించారు. తద్వారా భూమండలం వేడెక్కి అనేక అనర్థాలు జరుగుతాయని విశ్లేషించారు. దీంతో వివిధ రకాల జీవరాశులతోపాటు చెట్లు, మానవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని స్పష్టీకరించారు. దీన్నికాపాడాలంటే ప్లాస్టిక్ వాడకంమానేయాలని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పేపర్ బ్యాగులు, జూట్ బ్యాగులను వాడాలని వివరించారు. లేదంటే ఇంట్లో బట్టలతో తయారు చేసుకునే బ్యాగులను వినియోగించాలని సూచించారు. అనంతరం పలువురికి కాటన్ గుడ్డతో తయారు చేసిన బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుల్లో కేసు నడుస్తుండగా భూమికి కొలతలు ఎలా వేస్తారు..?!

**- ఆత్మహత్యా యత్నం చేసిన రైతు సోదరుడు ధనుంజయ**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధిత రైతు కుటుంబ సభ్యుడు ధనుంజయ, వైఎస్సార్‌సీపీ నాయకులు

**ఉరవకొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**

ఉరవకొండ సివిల్ కోర్టుతోపాటు జాయింట్ కలెక్టర్ కోర్టులో భూమి వివాదంపై కేసు నడుస్తున్న సమయంలో రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా భూమికి కొలతలు వేయించి హద్దులు చూపడం న్యాయ సమ్మతం కాదని మండల పరిధిలోని బూదగవి గ్రామానికి చెందిన రైతు చిన్న అంజినయ్య తనయుడు ధనుంజయ ఆవేదన వ్యక్తం చేశాడు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము 2002లో సోమశేఖర్‌గౌడ్ అనే వ్యక్తి నుండి 8.63 ఎకరాల భూమిని కొనగోలు చేసి డబ్బులు చెల్లించి అగ్రిమెంటు రాసుకున్నామన్నారు. తాము ఎప్పుడుకోరితే అప్పుడు రిజిస్ట్రేషన్‌చేసి ఇచ్చేలా అగ్రిమెంట్‌లో స్పష్టంగా నాడు రాసుకోవడం జరిగిందని అయితే కొన్ని కారణాలతో రిజిస్ట్రేషన్‌జరుగలేదన్నారు. అయితే సోమశేఖర్‌గౌడ్ మరణించడంతో ఆయన వారసులు తమకు భూమిని రిజి స్ట్రేషన్ చేసి ఇవ్వడానికి ఒప్పుకోక పోవడంతో తాము 2018లో కోర్టును ఆశ్రయించగా వారు హడావుడిగా మరొకరికి భూమిని విక్రయించారన్నారు. ప్రస్తుతం జేసీ కోర్టుతోపాటు సివిల్ కోర్టులో దావా నడుస్తుండగా స్థానిక రెవెన్యూ అధికారులు సదరు భూమిని కొలతలు వేసి హద్దులు చూపేందుకు యత్నించారని న్యాయం కోసం తన సోదరుడు మల్లికార్జున పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నం చేశాడన్నారు. న్యాయం కోసం ప్రాణం తీసుకునే పరిస్థితులు ఉన్నా రెవెన్యూ అధికారులు కొలతలు పూర్తీచేసి హద్దులు చూపడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేస్తూ తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఎం.నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, ఏ.సి.ఎర్రిస్వామి, కౌడికి గోవిందు, డిష్ సురేష్, మేకల సిద్దప్ప, మల్లెల జగదీష్, వడ్డే ఆంజినేయులు, పచ్చిరవి, చిన్నభీమా, మహానంది తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం తప్పనిసరి

**మండల వ్యవసాయ అధికారి వాసుకిరాణి**

**శెట్టూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మండల పరిధిలోని లక్ష్మంపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. కేవీకే శాస్త్రవేత్త మల్లికార్జున మాట్లాడుతూ,.. భూమి ఆరోగ్యం తెలుసుకోవడానికి భూసార పరీక్షలు అత్యంత అవసరమని తెలిపారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే దిగుబడులు పెరగడమే కాకుండా, వ్యయాలు తగ్గుతాయని సూచించారు. రైతులు యాదృచ్ఛికంగా ఎరువులు వాడటం వల్ల భూమి సారానికి నష్టం కలగడంతో పాటు, పంటల దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. ప్రతి రైతు తన భూమికి అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రైతులు భూసార పరీక్షలపై ఆసక్తి చూపుతూ, తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవడానికి నీటిని సంరక్షించుకోవాలని వర్షపు నీటిని నిలువ ఉంచుకోవటానికి నీటి కుంటలను పొలాల్లో ఏర్పాటు చేసుకోవాలని వేసవిలో లోతుకు దుక్కు చేసుకొని పడిన వర్షాన్ని అక్కడే ఇంకిపోయేలా చేసుకోవాలని రైతులకు పలు సలహా సూచనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గుత్తిలో ఘనంగా సత్యసాయి ఆరాధన ఉత్సవాలు

**గుత్తి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త**



సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో శుక్రవారం మండల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్య సాయి ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవా భావంతో మండు వేసవి సందర్భంగా ప్రత్యేక శిబిరంలో 600 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ రమణ మాట్లాడుతూ ఆధ్యాత్మిక గురువు సత్యసాయి ప్రభోదించిన ప్రేమ తత్వాన్ని ప్రతి ఒక్కరూ అవలంబించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వసుంధర, విశ్వనాథ్, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కంబదూరు ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

**కంబదూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త**



ఎక్సైజ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య

కంబదూరు ఎక్సైజ్ స్టేషన్‌ను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య శుక్రవారం తనిఖీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, సూపరింటెండెంట్ రామమోహన్ రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రేవతితో కలిసి ఆయన స్టేషన్ రికార్డులను పరిశీ లించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను త్వరగా పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్లు దాఖలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే నాటు సారా , కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.మద్యం దుకాణాల్లో అమ్మకాలు సురక్ష యాప్ ద్వారా నిర్వహించేలా చర్యలుతీసుకోవాలని సూచించారు.తనిఖీ సమయంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణతో పాటు ఇతర సిబ్బంది హాజరయ్యారు.



సురక్ష యాప్ ద్వారా మద్యం అమ్మకాలను పరిశీలిస్తున్న దృశ్యం

## యస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో ఒక రోజు జాతీయ సాంకేతిక సింపోజియం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

స్థానిక యస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో ఒక రోజు జాతీయ సాంకేతిక సింపోజియం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆదేశాలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డా సి.సోమశేఖర రెడ్డి, గౌరవ అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన తన ప్రసంగంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్యసించి, భవిష్యత్‌లో దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.సాయికృష్ణ సాంకేతిక రంగంలో ఉన్న అవకాశాల గురించి వివరిస్తూ, విద్యార్థులను ప్రోత్సహించారు. పాల్గొని, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్. ఏ.వి.ప్రసాద్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటి సింపోజియాలు విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.శ్రీనాథ్ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఈ సింపోజియంలో పేపర్ ప్రెజెంటేషన్స్, పోస్టర్ ప్రెజెంటేషన్స్, టెక్నికల్ క్విజ్‌లు, ఇతర సాంకేతిక పోటీలు నిర్వహించబడగా, వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయబడింది. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు టి.విక్రమ్, ఎన్.లావణ్య, దివ్యశ్రీ, జాహ్నవి, సానియా, శ్వేత, సుధీంద్ర బాబు, రామకృష్ణయ్య, తనుశ్రీ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న దృశ్యం

## ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ పిఎఫ్ ఖాతాలు సరి చేయాలి
### - ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ పిఎఫ్ ఖాతాలు సరి చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ గిరిజమ్మని, సిఈఓ, డిప్యూటీ సిఇఓలను కోరారు. ఈ సందర్భంగా వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పిఎఫ్ ఖాతాలలో లోన్ తీసుకోకపోయినా చాలా మంది ఉపాధ్యాయుల పిఎఫ్ ఖాతాలలో లోన్‌కు తీసుకున్నట్లు వారి అకౌంట్‌లలో చూపిస్తున్నది. ముఖ్యంగా ఒడిసి మండలములో పని చేస్తున్న 8 మంది ఉపాధ్యాయులు 2022లో ఒక్కొక్కరు రూ. 3,23,000లోన్ తీసుకోక పోయినా లోన్ తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నదని వాటిని సరిచేయాలని వ్రాతపూర్వకంగా జిల్లా పరిషత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వి.రాజశేఖర్, ఎపిటిఎఫ్ 1938 పూర్వ అధ్యక్షులు వెంకటరెడ్డి, సత్య సాయి జిల్లా నాయకులు విశ్వనాథ రెడ్డి, బాబ్ జాన్, మనోహర్ రెడ్డి, రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టియు నేతలు

## పల్లెలను స్వయం సమృద్ధిగా మార్చటంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం
### - ఎంపీడీఓ తేజోష్ణ వెల్లడి - ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం


ఎంపీడీఓ తేజోష్ణను సన్మానిస్తున్న ఉద్యోగులు


మండల ప్రజాపరిషత్, గ్రామపంచాయతీల ఉద్యోగులతో ఎంపీడీఓ తేజోష్ణ.

పామిడి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

గ్రామస్థాయి ప్రజాస్వామ్యానికి పునాదిగా పల్లెలను స్వయం సమృద్ధిగా మార్చటంతో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం పాత్ర పోషిస్తుందని ఎంపీడీఓ తేజోష్ణ పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈసందర్భంగా ఎంపీడీఓ తేజో ష్ణ మాట్లాడుతూ 1993 ఏప్రిల్ 24న రాజ్యాంగంలోని 73 వ సవరణ చట్టం అమల్లోకి వచ్చిందని గ్రామీణ స్వప రిపాలనను పటిష్టం చేస్తూ గ్రామ స్వరాజ్యాన్ని ప్రోత్స హించటానికి ప్రతిఏటా జాతీయ పంచాయతీరాజ్ దినో త్సవాన్ని జరుపుకోవటం జరుగుతుందని తెలిపారు. గ్రా మాల్లో ప్రజాస్వామ్య వికేంద్రీకరణ గ్రామసభల నిర్వా హణ, స్థానిక నాయకత్వాన్ని బలపర్చటం, అభివృద్ధిలో ప్రజల బాగస్వామ్యాన్ని పెంపొందించటం ముఖ్యఉద్దేశ్యం అన్నారు. గ్రామాలు ప్రగతి పథంలో నడిచి నప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని తెలియజేశారు. ఉద్యోగులు తమ విధులను అంకితభావంతో నిర్వర్తి ంచినప్పుడే తగిన గుర్తింపు లభించి ఉన్నతంగా ఎదుగుతారని ఆదిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమ సేవలను అందించిన వివిధ గ్రామపంచాయతీల ఉద్యోగులను సన్మానించిన ఎంపీడీఓ తేజోష్ణ వారికి మెమెంటోలను అందజేయగా ఉద్యోగస్థులు ఆమెను సన్మానించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమనాయుడు, మండల ప్రజాపరిషత్, గ్రామపంచాయతీల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ సేవా దృక్పదాన్ని అలవర్చుకోవాలి
### - కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్‌కుమార్
### - సీహెచ్‌సికి వాటర్ కూలర్‌ను వితరణ చేసిన చిలకల రాజ్‌గోపాల్

పామిడి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ప్రతిఒక్కరూ సేవా దృక్పదాన్ని అలవర్చుకోవాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సభ్యులు, శ్రీ సాయి హాస్పిటల్ నిర్వాహకులు చిలకల రాజ్‌గోపాల్ శుక్రవారం సీహెచ్‌సికి వాటర్ కూలర్‌ను వితరణ చేశారు. వాటర్ కూలర్‌ను ప్రారం భించిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ వేసవికాలం దాహార్తిని తీర్చటం మహాపుణ్యకార్యం అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యసేవలను పొందేందుకు వివిధ ప్రాంతాల నుండి అనేకమంది రోగులు వస్తుంటారని వారి దాహార్తిని తీర్చేందుకు చిలకల రాజ్‌గోపాల్ వాటర్ కూలర్‌ను వితరణ చేయటం శుభపరిణామం అని తెలిపారు. చిలకల రాజ్‌గోపాల్ మాట్లాడుతూ దాతల సహకారంతో రోగులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తూనే ప్రజాప్రయోజనాల కోసం సేవా కార్యక్రమాలను చేపడుతామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో హెడ్ నర్స్ శివకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్‌కుమార్

## పంచాయతీని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాము
### - పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి

అనంతపురం రూరల్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

అనంత రూరల్ రాచనపల్లి గ్రామపంచాయతీని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని పంచాయతీ అభివృద్ధి అధి కారి సర్దార్ వలి తెలిపారు. శుక్రవారం గ్రామ సచివాలయంలో పంచాయతీ అభివృద్ధిఅధికారి సచివాలయ సిబ్బందితో కలసి జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం వేడుకలు ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముందుగా గాంధీ జీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ అ భివృద్ధి అధికారి సర్దార్ వలిమాట్లాడుతూ పంచాయ తీలో ఎటువంటి అభివృద్ధి కార్యక్ర మాలు చేయాలన్న ఆ పనులు నిర్వహణకు నాయకులు ఎంతో సహకారం అందించి గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు లేకుండా గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించడం జరిగిందని, మీ వార్డులో ఏమైనా సమస్య లు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో వీఆర్వో నరసయ్య, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం.

## గ్రామాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యం - పంచాయతీ అభివృద్ధి అధికారి

అనంతపురం రూరల్,ఏప్రిల్ 24, ప్రభాతవార్త:

గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమని, అదే విదంగా స్వర్ణాంధ్ర లక్ష్యంగా గ్రామంలో ని ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నామని పంచాయతీ అభివృద్ధి అధికారి యు. హిదయాతుల్లా తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, అంబేద్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగాతీర్చిదిద్దేందుకు వివిధ పార్టీ నాయకుల సమన్వయం ఎంతో ముఖ్యమని అయన కోరారు. గ్రామస్థాయిలో పారదర్శకత, బాధ్యతాయుత పరి పాలన ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధం, రహదారులు, విద్య, ఆరోగ్య రంగాల్లో మరింత మెరుగైన సేవలు అందించడంపై దృష్టి పెట్టామని తెలిపారు. పంచాయతీ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం కార్మికులు కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్మికులకు సోపులు, అయిల్ డబ్బాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పంచాయతీ కార్మికులకు ఆయిల్ సోపులను చేస్తున్న దృశ్యం.

## సిఎస్‌లకు, డివోలకు టిఏ, డిఏలను వెంటనే వారి వారి వ్యక్తిగత ఖాతాలో జమ చేయాలి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

గత విద్యా సంవత్సరం 2024-25లో చీఫ్ సూపరింటెండెంట్‌గా డిపార్ట్మెంటల్ ఆఫీసర్లుగా నియమించారు. అయితే ఓపెన్ స్కూల్స్ వాళ్లకు సెప్టెంబర్‌లో గత సంవత్సరం సెప్టెంబర్‌లో వారికి రావలసిన బకాయి లు చెల్లించడం జరిగింది. కానీ రెగ్యులర్ 10వ తరగతి పరీక్షలు నిర్వహించిన సిఎస్‌లకు డివోలకు ఇంతవరకు టిఏ, డిఏలు చెల్లించలేదు, ముఖ్యంగా సిఎస్‌లు తన సొంత ఖర్చులతో పరీక్ష నిర్వహణ కేంద్రానికి ఖర్చు చేయడం జరిగింది. ఇంతవరకు కంటిన్జెంట్ అమౌంట్ కూడా జమ కాలేదు. కావున వెంటనే స్పందించి ఎవరెవరికి వ్యక్తిగత అకౌంట్‌లో జమ కాలేదో వారికి వెంటనే జమ చేయాలని సిఎస్, డిఓలు కోరుచున్నారు. కావున ఈ విషయాన్ని గుర్తించి సమస్యను పరిష్కరించాలని అధికారులను స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బొల్లె రాజశేఖర్‌ను కోరారు.


ఎస్ఎస్ఎ, ఎపి రాష్ట్ర కార్యదర్శి బొల్లి చంద్రశేఖర్

## ఆకుతోటపల్లిలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

అనంత రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామపంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలు స్థానిక నాయ కులు పంచాయతీ అభివృద్ధి అధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా గ్రామ సచివాలయ కార్యాలయం కేక్ కట్చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ ంలో మండల క్లస్టర్ ఇంచార్జ్ రాగే మురళి గ్రామ కమిటీ అధ్యక్షుడు పూల నారాయణస్వామి నవీన్ నాగరాజు శివ రాజు రామ చంద్ర గ్రామపంచాయతీ సిబ్బంది, వేగేంద్ర ఇందిరా సలీల పాల్గొన్నారు.


పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

## 26న తలపెట్టిన బి.సి గళం పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యేతోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

ఈనెల 26న అనంతపురం లలిత కళపరిషత్ లో జరిగే బి.సి గళంఖి పోస్టర్లను రాప్తాడు మాజీ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి బీసీ సోదరులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, కన్వీనర్లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయ వంతం చేయాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


పోస్టర్ల ను ఆవిష్కరిస్తున్న దృశ్యం.

## పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.

అనంతపురం రూరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త : అనంత రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి గ్రామానికి చెందిన గవ్వల నాగన్న అనారోగ్య ంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. విషయం తెలుసు కున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, చియ్యేడు గ్రామ ంలోని వారి స్వగృహంకు చేరుకుని గవ్వల నాగన్న భౌతిక దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం.

## వైభవంగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 15వ ఆరాధన



కొల్హాపురం మహాలక్ష్మి ఆలయంలో భగవాన్ సత్యసాయిబాబా ఆరాధన ఉత్సవాలు




అనంతపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త బ్యూరో

శ్రీ కొల్హాపుర్ మహాలక్ష్మి ఆలయంలో వలి స్వామి ఆశ్రమంలో శ్రీ సత్యసాయి బాబా వారి 15వ ఆరాధన పురస్కరించుకుని, ప్రసాద వినియో గం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు భక్తులు 200 మందికిపైగా విచ్చేసినారు. ఈ కార్యక్రమంలో సాధు వెంకటసాయి హర్షిత్‌వారి బృందం, సద్గురు వలి స్వామిాశ్రమం పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 29 నుండి లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవ వేడుకలు

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

తాడిపత్రి మండలం జంబులపాడు గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవ వేడుకలు ఈ నెల 29 నుండి ఘనంగా ప్రారంభంకానున్నాయి. ఇందులో భాగంగా 29వతేదీ బుధవారం ఉదయం గణపతిపూజ, వేదపారా యణము, పుణ్యాహ వాచనము, పంచగవ్యప్రాసన, రక్షాబంధన, మాతృకాప్టజ, ప్రధాన కలశస్థాపన, మహా మంగళహారతి, సాయంత్రం విష్ణుసూక్త పారాయణము, వేదపారా యణము, మృత్‌సంగ్రహణ ము, అంకుకార్పణ, వేదస్వస్తి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నా రు. 30వతేదీ గురువారం ఉదయం హోమాలు, సుదర్శన, శ్రీసూక్త, పురుష సూక్త పారాయణ హోమం, మహామంగళహారతి, సాయంత్రం ప్రాతఃకా లపూజ, దీక్షాహోమం, స్వామివారి మూలమంత్ర జమహోమం, మహామం గళహారతి, రాత్రి అర్కెస్ట్రా కార క్రమం నిర్వహించనున్నారు. మే 1వతేదీ శుక్రవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకము, వస్త్ర, పుష్పాలంకరణ, అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణోత్సవాన్ని అర్చకులు ఏ.మురళీకష్ణ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అలాగే హోమాలు, పూర్ణాహుతి, మహదాశీర్వచనం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమం నిర్వహిం చనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. కళ్యాణోత్సవం మూడు రోజుల పాటు జంబుల పాడుకు చెందిన తమ్మినేని రామన్న గారి ప్రభాకర్‌నాయుడు సోదరులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. పెద్దఎత్తున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని జంబులపాడు గ్రామ ప్రజలు తెలియచేశారు.


లక్ష్మీనరసింహస్వామి

## ఉపాధ్యాయ సమస్యలను తక్షణం పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం - ఎపిటిఎఫ్ 1938 అనంతపురం జిల్లా శాఖ నేతలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ఏపీటీఎఫ్ 1938 జిల్లా కార్యవర్గ సమావేశం ఉపాధ్యాయ భవన్‌లో అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్ తదితర ఫెడరేషన్ జిల్లా, రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల సాధనకై ఉద్యమిద్దాం అంటూ పిలుపునివ్వడం జరిగింది. ఏప్రిల్ 25న విజయవాడలో ప్యాఫ్టో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలో ఫెడరేషన్ మిత్రులు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని మా వాని వినిపిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస నాయక్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, సీనియర్ నాయకులు వెంకట రెడ్డి, జిల్లా పూర్వ అధ్యక్షులు రవీంద్ర, ఐపీయా కమిటీ సభ్యులు సత్య ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులు పోతులయ్య, అదనపు ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి అశోక్ నాయక్, ఉరవకొండ నాయకులు హనుమప్ప, భాస్కర్, రాష్ట్ర కౌన్సెలర్ నాగరాజు, మధు తదితర సబ్ కమిటీ మిత్రులు, జిల్లా నాయకులు నరసింహులు, హనుమంతుమల్లినాథ్, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఫెడరేషన్ మిత్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ 1038 నేతలు

## బదిలీలు, పదోన్నతులపై కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పలు ముఖ్య విషయాల విడుదల

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

కమిషనర్ అఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ బదిలీలు పదోన్నతులకు సంబంధించి పలు ముఖ్య విషయాలను శుక్రవారం విడుదల చేసింది. జిల్లాల పునర్విభజన, ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌పై స్పష్టత వచ్చిన తర్వాత నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. ప్లస్ 2 పాఠశాలలు, 294 +210 పాఠశాలల్లో సుమారు 1100 పోస్టులకు ఆర్థికశాఖ ప్రభుత్వ అనుమతి కొరకు పంపించినట్లు చూపించారు. ట్రాన్స్ఫర్డ్ బట్ నాట్ రిలీవ్డ్ టీచర్స్, బదిలీచట్టం ప్రకారం 50 ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండాలి, లేదా సబ్ స్టిట్యూట్ వచ్చేవరకు రిలీవ్ చేయలేమని పేర్కొన్నారు. ఎస్.జి.టి.లకు స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్ ప్రమోషన్లు ఇవ్వడంలో ప్రతిష్టంభన తొలగించాలని, సర్వీస్ రూల్స్‌కు ఆమెండ్ మెంట్ చేసి 70:30 నిష్పత్తిలో ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. 1966, 1998 టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్ విషయమై సంబంధిత బాధిత టీచర్లు రిప్రెజెంట్ చేస్తే పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

## ఘనంగా మొదటవ రోజు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

గత తొమ్మిది సంవత్సరాలుగా నిర్విరామంగా దాతల సహాయ సహకారాలచే, శ్రీవారి సేవకులచే అనంతపురం పట్టణంలో వాసవి జయంతి సందర్భంగా మూడు రోజులపాటు మజ్జిగ పంపిణీ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం దాదాపు 1000 మందికి పైగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం దాత ఆర్ఆర్ క్యాటర్స్ సహాయ సహకారం, శ్రీవారి సేవకులు అలాగే ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో అద్భుతంగా కార్య క్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు రంగాచారి పాల్గొన్నారు. వీటితోపాటు శ్రీవారి సేవ కులు ఆలయ కమిటీ వారు వారి సేవలను అందించారు.


వాసవి మాత జయంతిని జరుపుకుంటున్న దృశ్యం


మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

## దళిత రైతుల భూములకు దారి లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

దళిత రైతుల భూములకు దారి లేకుండా చేసి జేసీబీలు, ట్రాక్టర్లతో మట్టిని అమ్ముకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు ఎం.పెద్దిరాజు మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన తహశీల్దార్‌తో పాటు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి మండలం భోగసముద్రం పంచాయతీ వెంకటాంపల్లి గ్రామంలో ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో సీలింగ్ ల్యాండ్ కింద ఎస్‌సి మాదిగలైన మద్దిలేటిరాముడు, ఓబన్న, సుంకమ్మ, కేశమ్మ, లింగమ్మ, చిన్న దుర్గమ్మ, లక్ష్మమ్మలకు 301, 302, 303, 304, 305, 306, 307 సర్వే నెంబర్లలో భూములు ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి వారు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అయితే ఆ భూముల పక్కన వంకలో ఉన్న దారిని కొందరు జేసీబీలతో వంకలో మొత్తం మట్టిని తవ్వి ట్రాక్టర్లతో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీంతో రైతుల భూముల్లోకి వెళ్లే దారి లేకుండా పోయిందన్నారు. వెంటనే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని జేసీబీలు, ట్రాక్టర్లను సీజ్ చేసి మాదిగ రైతులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రామమోహన్, పెద్దరాజు, శివ రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


సిఐకి వినతిపత్రం అందచేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

## అసంపూర్తి భవనం..అవస్థల వైద్యం..!

**మొదటిపేజీ తరువాయి....** సామాన్య కుటుంబాలు చాలానే ఉన్నాయి. వీరందరికీ ప్రభుత్వ వైద్యమే పెద్ద దిక్కు. కానీ ఆ ప్రభుత్వ వైద్యం వసతుల లేమితో కొట్టుమిట్టాడుతుండటంతో మండల పరిధిలోని 70 వేల మందికి ఉచిత వైద్యం నామమాత్రంగా మారింది.

**:అసంపూర్తి భవనాలు..అవస్థల ఆసుపత్రులు**

యాడికి మండలంలో 1986లో యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 2012లో రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు వైద్య సేవలు అందించడం ప్రారంభించాయి.యాడికి ప్రారంభం నుంచే పక్కా భవనంలోనూ, రాయలచెరువు శిథిలావస్థలో ఉన్న ఒక ఉప కేంద్రంలోనూ తమ వైద్యసేవలు ప్రారంభించాయి. 40 ఏళ్లుగా అదే భవనంలో వైద్యసేవలు అందిస్తున్నా యాడికి పీహెచ్‌సీలో మెరుగైన సౌకర్యాలకు గాని, వైద్యసేవల్లో ఉన్నతికి గాని నోచుకోలేదు. 14 ఏళ్లుగా పక్కా భవనంలేక రేకుల షెడ్డులోనే తీవ్ర అసౌకర్యాల మధ్య రాయలచెరువు పీహెచ్‌సీ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఇక్కడ చివరికి ఔషధాల శీతలీకరణకు కూడా సిబ్బంది ఆపసోపాలు పడాల్సి వస్తోంది.జాతీయ రహదారి పక్కనే ఉన్నప్పటికీ ఇక్కడి గదులను చూస్తే మారుమూల ప్రాంతాల్లో ఉండాల్సిన పీహెచ్‌సీనేమో ఇది అనిపించకమానదు. ఈ రెండు పీహెచ్‌సీల పరిధిలో సరిపడా నలుగురు వైద్యులున్నప్పటికీ వసతుల లేమే పట్టి పీడిస్తోంది. ఈ రెండు పీహెచ్‌సీల్లో రోజుకు సగటున దాదాపు 250 మంది వైద్య చికిత్సలు పొందుతుంటారు. ప్రతి నెలా 140 మంది గర్భిణులు, 70 మంది వరకు బాలింతలు వైద్య సేవలు పొందుతుంటారు.16 ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలోని రోగులను కూడా సిబ్బంది ఇక్కడికే తీసుకొస్తుంటారు. మండలంలో మరో 300 మందికి పైగా జనం 30కి పైగా ఉన్న ఆర్ఎంపీ క్లినిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు పొందుతుంటారు. యాడికి పీహెచ్‌సీలో అత్యవసర వైద్యానికి, శస్త్ర చికిత్సలకు ఏ తాడిపత్రికో, గుత్తికో, అనంతపురానికో బాధితులు పరుగులు తీయాల్సి వస్తోంది.ఇక ఉపకేంద్రంలో కంటే అధ్వానంగా సౌకర్యాలున్న రాయలచెరువు పీహెచ్‌సీలో కాన్పులు కూడా చేయలేని దుస్థితి నెలకొంది.

**:భవనం పూర్తి కాదు..బాధ తీరి పోదు..!**

యాడికి సీహెచ్‌సీగానూ, రాయలచెరువు పూర్తి స్థాయి పీహెచ్‌సీగానూ మారాలంటే పక్కా భవనాలు చాలా అవసరమని అటు వైద్యాధికారులు, ఇటు స్థానికులు భావిస్తున్నారు. మెరుగైన వైద్యం అందించడానికి అవసరమైన భవనాలు లేకపోవడంతో సేవాలోపాలను అధిగమించడానికి ప్రభుత్వం ఈ రెండు పీహెచ్‌సీలకు నూతన భవనాలు మంజూరు చేసింది. యాడికిలో రూ.1.30 కోట్ల అంచనాతో ప్రస్తుత పీహెచ్‌సీకి ఎదురుగా నూతన భవనాన్ని, రాయలచెరువులో రూ. 1.95 కోట్లతో దాత సీవీ రమణారెడ్డి ఇచ్చిన స్థలంలోనూ నూతన భవన నిర్మాణాలు చేపట్టారు. యాడికి పీహెచ్‌సీ భవనానికి గుత్తేదారులు రూ. 40 లక్షలు ఖర్చు చేస్తే రూ. 4 లక్షలు, రాయలచెరువులోని భవనానికి రూ. 50 లక్షలు ఖర్చు చేస్తే రూ. 18 లక్షలు చెల్లింపులు జరిగిన తర్వాత పర్యవేక్షణాధికారులు బిల్లుల చెల్లింపుపై దృష్టి సారించకపోవడంతో గుత్తేదారులు విధిలేని పరిస్థితిలో చేతులెత్తేశారు. ఏడాదిన్నరకుపైగా భవన నిర్మాణ పనులు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో ఈ రెండు నూతన భవనాలు ఖరీదైన అసంపూర్తి దిష్టిబొమ్మల్లా మిగిలిపోయాయి. ఈ రెండు భవనాల నిర్మాణలపై పర్యవేక్షణ బాధ్యత రోడ్లు భవనాల శాఖకు అప్పగించడం, సంబంధిత అధికారులు సరైన సమయంలో బిల్లులకు ప్రతిపాదించక పోవడం వంటి సమస్యలతో భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయి స్థానికులకు కష్టాలను మిగిల్చాయి.

**:పీహెచ్‌సీల్లో సలహాలకు మంగళం..!**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులను మెరుగుపరుస్తూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తరచూ సమావేశాలు నిర్వహిస్తూ పీహెచ్‌సీల్లో కనీస సౌకర్యాల కల్పనకు సంఘాల సభ్యులు కృషి చేయాలి. ఈ సలహా సంఘాల సమావేశాలకు మంగళం పాడటంతో సమావేశాలు జరగక, ఆసుపత్రుల్లో వసతులు సమకూరక రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎంపీపీ చైర్మన్‌గా, పీహెచ్‌సీ వైద్యుడు కన్వీనరుగా, తహసీల్దార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు, సర్పంచి, మహిళా ఎంపీటీసీ సభ్యురాలు సభ్యులుగా ఈ సంఘంలో ఉంటారు. ప్రతి మూడు నెలలకొకసారి ఈ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. రెండున్నరేళ్లుగా ఈ సమావేశాలు నిర్వహించకపోవడంతో ఆసుపత్రుల్లో వసతుల కల్పన గురించి అడిగేనాథుడే కరవయ్యారు.

**:ప్రస్తుతానికి రద్దయ్యాయి..మళ్లీ అనుమతులు రావాల్సిందే- రాజశేఖర్, ఈఈ, ఆర్‌అండ్‌బీ, అనంతపురం.**

25 శాతం లోపు అసంపూర్తి పనులు అయిన నిర్మాణాలను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ప్రస్తుతానికి ఆ రెండు పీహెచ్‌సీ భవనాల నిర్మాణాలు రద్దయినట్లే. మళ్లీ ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సిందే. ఆ భవన నిర్మాణాల పురోగతిపై శ్రద్ధ పెట్టాల్సింది వైద్య ఆరోగ్య శాఖే. మేము నిధుల వినియోగంపై పర్యవేక్షణ వరకే పని చేశాం.

04ATP24_04ATP24.qxd 24-04-2026 PM 11:39 Page 1



# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా వినతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ప్రజల వినతిని శ్రద్ధగా విని సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించడమే తమ బాధ్యత అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, పేదల సంక్షేమం కో సం ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. అలాగే, ప్రజలు ఎలాంటి సమస్యలైనా నిర్భయంగా తమ వద్దకు రా వాలని, ప్రతి సమస్యకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్త చెరు వు, బుక్క పట్నం, పు ట్టపర్తి మం డలాల ప్రజలు స్థానిక నాయకులు, పార్టీ కార్య కర్తలు, అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

# అభివృద్ధి చేస్తున్నాం.. సంక్షేమ పథకాలు అందిస్తున్నాం

## - దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీ మీదనే ఉంది
## - పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

రాప్తాడు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

గత రెండేళ్లలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి న బాధ్యత మీపైనే ఉందని పార్టీ శ్రేణులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనం తపురంలోని తన క్యాంపు కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గ టీడీపీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరి శీలకులు బొక్సంపల్లి రామకృష్ణప్ప, కమతం కాటమయ్యలతో పాటు ముఖ్య నాయ కులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ మండల స్థాయిలో ఇంకా పెండింగ్‌లో ఉన్న పార్టీ కమిటీలు, పార్టీ అనుబంధ కమిటీల గురించి చర్చించారు. ఇంకా చేయాల్సి న అభివృద్ధి కార్యక్రమాలను మండ లాలు, గ్రామాల వారీగా ఎంపిక చేయాలన్నారు. వాటిని ప్రాధాన్యత వారిగా చేపడుతామన్నారు. నిధులు కూడా తీసుకురా వాల్సి న అవసరం ఉందన్నా రు. పార్టీ బలంగా ఉంటే మనం బాగుం టామని.. అందుకే పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ముఖ్యంగా మనం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

# రూ.250 కోట్లు విలువచేసే స్థలాలను కేవలం తీర్మాణాలతో కేటాయించారు..!

## - ప్రభుత్వ అనుమతులు లేకుండా సామాజిక, వ్యక్తిగత అవసరాలకు స్థలాలిచ్చారు - లోకాయుక్తలో కేసుతో వాటిని పంచాయతీ స్వాధీనం చేసుకోవడానికి చర్యలు - గ్రామసభలో ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.సతీష్‌బాబు వెల్లడి - స్థాలాలు పొందినవారు పంచాయతీకు అద్దె చెల్లించేందుకైనా సిద్ధం కావాలని పిలుపు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్



ఉత్తమ సేవలందించిన కార్మికులను సన్మానించిన దృశ్యం



గ్రామసభకు హాజరైన ప్రజలు

ఉరవకొండ, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 1995-2024 మధ్య కాలంలో 250 కోట్ల రూపాయలు విలువచేసే పబ్లిక్ పర్పస్ స్థలాలను కేవలం పంచాయతీ తీర్మాణాలతో సా మాజిక అవసవరాలు, వ్యక్తిగ త అవసరాలకు కేటాయి ంచా రని ఇది పూర్తిగా చట్ట విరుద్ధ మని ఎంపీడీవో, పంచా యతీ ప్రత్యేక అధికారి బి.వి.రవిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.సతీష్ బాబు అన్నారు. పట్టణ ంలోని స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో శు క్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్స వం సందర్భంగా పంచాయతీ పరిపాలన అధికారి షేక్ మహమ్మద్ రఫీ అధ్యక్ష తన గ్రామసభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవ కొండ పట్టణా నికి చెందిన వ్యక్తి 2021లో పంచాయతీ స్థలాలు దుర్వి నియోగం, అనా క్రాంతం అవుతున్నాయని విచ్చలవిడిగా కేటాయింపులు జరు గుతున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని లోకాయుక్తలో కేసు వేసిన క్రమంలో లోకాయుక్త ఆదేశాల మేరకు ఇటీవల పంచాయతీ పబ్లిక్ పర్పస్ స్థలాలు ఎప్పుడెప్పుడు, ఎవరెవరికి ఎన్ని సెంట్లు కేటాయించారు, ఇప్పుడు సదరు స్థలాల పరిస్థితి ఏంటన్న విషయమై సర్వే చేసి కొలతలువేసి పక్కాగా రికార్డులు తయారు చేయడం జరిగిందన్నారు.

ఈ స్థలాల గురించి ఎలాంటి చర్యలు తీసుకు న్నారో కేవలం వారం రోజుల్లోగా రాతమూలకంగా సమాధానం చెప్పాలని ఆదేశాలు ఉన్నా యన్నారు. పంచాయతీకు పబ్లిక్ పర్పస్ స్థలాలను సామా జిక, వ్యక్తిగత అవసరాలకు కేటాయించే హక్కు లేదన్నారు. కేవలం ఇక్కడ తీర్మాణం చేసి మంజూరుకై డీపీవో, కలెక్టర్, పంచాయతీరాజ్ కమీషనర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని అయితే ఇక్కడ 1994 పంచాయతీరాజ్ చట్ట ప్రకారం నిబంధనలు అమలుకు నోచుకోలే దన్నారు. దీంతో కేవలం తీర్మాణాలతో కేటాయించిన స్థలాలను తిరిగి పంచాయతీకు స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలున్నాయన్నారు. తీర్మాణాలతో పొందిన స్థలాల్లో నేడు కళ్యాణ మండపాలు, వ్యక్తిగత ఆవాసాలు, ఇతం్రా కట్టడాలు నిర్మించుకున్నారని వారు ఇప్పటికైనా ముందుకొచ్చి పంచా యతీ ద్వారా లీజు అగ్రిమె ంటు చేసుకొని అద్దె చెల్లించడానికి సిద్ధ మని రాతమూలకంగా ఇస్తే వాటిని అను మతుల కోసం ప్రభుత్వానికి పంపుతామని స్వతహాగా తాము నిర్ణ యాలు తీసుకోవ దానికి వీలు లేదన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రభుత్వం తీసుకో వాల్సి ందేనని ఇప్పటికైనా స్థలాలు పొంది నవారు ముందు రావాలన్నారు. పంచాయతీలు స్వయం సంవృద్ధి సాధించడానికి వనరులను వినియోగి ంచుకొని పన్నులను సక్రమంగా వసూళు చేయాల్సి న అవసరం ఉందని ఆపై ప్రభుత్వాల నుండి సహాయ సహకారాలు అందుతాయన్నారు. మేజర్ పం చాయతీ గ్రేడ్-1 నుంచి రూ ఆర్బన్ పంచాయతీగా అప్‌గ్రేడ్ అయి ఉద న్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ పకడ్బందీగా జరుగాలని, ఎస్‌డబ్ల్యూ పీసీ లో ప్లాస్టిక్‌తోపాటు తడి, పొడి చెత్తను వేరుచేసి సంపదను సృష్టి ంచుకోవాల న్నారు. పట్టణంలో 30 సంవత్స రాలు క్రితం వేసిన తాగునీటి పైప్‌లైన్లు కావడంతో పలుచోట్ల డ్రైనేజీ నీరు పైపుల్లోకి చేరి నీరు కలుషితమ వుతోందని సమస్యను పరిష్కరిం చడానికి చర్యలు తీసుకొం టున్నామన్నారు. ఆర్థి క మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ కారణంగా నియోజకవర్గానికి 450 కోట్ల రూపాయల వాటర్ గ్రిడ్ మంజూరు అయిందని అది ఇప్పుడు టెండర్ దశలో ఉందని తద్వారా నీటి సమస్యకు శాశ్వితం పరిష్కారం లభి స్తుందన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పలువురు పంచాయతీ కార్మికులను శాలువాలుకప్పి ఘనంగా సన్మానించి వారి సేవలను అధికారులు కొని యాడారు. ఈ గ్రామసభలో ఆర్‌డబ్ల్యూఎస్ సైట్ ఇంజనీర్ దాక్షయణి, పంచాయతీ జూనియర్ సహాయకులు అబ్దుల్ హుసేన్, నరసింహులు, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ జయప్రకా ష్‌గౌడ్, తాజా మాజీ వార్డు సభ్యులు పి. నిరంజన్‌గౌడ్, ఎం.రామాంజినేయులు, టిడిపి నాయకులు చాబాల ఈశ్వరయ్య, కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# జలధార జలహారతి పనులు వేగవంతం చెరువులకు నీరు చేరేలా చర్యలు ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించిన కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్

నల్లమాడ ఏప్రిల్ 24 ప్రభాతవార్త,

జిల్లాలో నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ జలధార జలహారతి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నల్లమాడ మండలం కొండిగానిగుట్ట వంకలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫీడర్ ఛానల్ పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల అంచనా వ్యయం, నీటి మళ్లింపు మార్గాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొండిగానిగుట్ట వంక నుంచి వచ్చే నీరు కొత్తకుంట మీదుగా రెడ్డిపల్లి చెరువుకు, అక్కడి నుంచి మలుకవే ముల చెరువుకు చేరే విధంగా పనులు జరుగుతున్నట్లు అధికారులు వివరిం చారు. మొదట నల్లమాడలో ఎస్ డబ్ల్యూ పిసి సెంటర్ ను సందర్శించి న కలెక్టర్ అక్కడి వర్కర్ల పనితీరును అభినందించి కార్మికులను సన్మానిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో అధికారులు మరింత కృషి చేయాలని సూచించారు.

అదేవిధంగా మండలంలో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులు త్వరి తగతిన పూర్తి చేసి నిర్ణయించిన గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశిం చారు. జిల్లాలోని చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయా లని, పూడిక తొలగింపు, కాలువల శుభ్రత ద్వారా నీటి ప్రవా హం నిరం తరం కొనసాగేం దుకు చర్య లు తీసుకోవాలని సూచిం చారు. ఉపాధి హామీ పథకం ద్వారా సాగునీటి వనరులను బలో ఎతం చేసి రైతులకు ఉప యోగపడేలా చర్యలు చేపట్టాలని అధికా రులకు తెలిపా రు. ఈ కార్యక్ర మంలో డ్వామా పీడీ కె. విజయ ప్రసాద్, పుట్టపర్తి క్లస్టర్ ఏపీడీ వి. రమేష్ బాబు, తహశీల్దార్ మనోజ్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో అంజినప్ప, ఈఈఆర్డీ, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది మరియు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్



పుట్టపర్తి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పం చాయతీ అధి కా రుల ను, కార్మికులను పుట్ట పర్తి ఎమ్మెల్యే పల్లె సిం ధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, డీఎల్‌పీఓ అధికారి సమత సన్మానిస్తున్న దృశ్యాలు.



# అంకిత భావంతో విధులు నిర్వర్తించండి

**మొదటిపేజీ తరువాయి....** చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల అమలుకు అవసరమైతే విద్యాశాఖ మరియు స్వర్ణ గ్రామ వార్డ్ సచివాలయాల ద్వారా అవగాహన కార్యక్రమంలో భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా ఐసీడీఎస్ అధికారి శశికళ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం సివిల్ సప్లై సర్ రమేష్ రెడ్డి, ఇన్చార్జి డిఎంహెచ్వో శ్రీనివాసులు రెడ్డి , సిడిపిఓ ఉరవకొండ శ్రీదేవి, సింగనమల సిడిపిఓ లలితమ్మ, తాడిపత్రి సిడిపిఓ షాజిదా బేగం, గుత్తి సిడిపిఓ ఎల్లమ్మ, అనంతపురం సిడిపిఓ ఉమా నార్పల సిడిపిఓ భారతి సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 26న అనంతపురంలో జరిగే బిసి గళం సభను విజయవంతం చేయండి

## - మీడియా సమావేశంలో వైసిపి నేత డా.బత్తల హరి ప్రసాద్

కదిరి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ఈ నెల 26న ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బిసి గళం సభను విజయవంతం చేయాలని వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, రాయదుర్గం నియోజకవర్గ పరిశీలకులు డా.బత్తల హరి ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కుమ్మరవాండ్లపల్లిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం బిసిలపై చేపడుతన్న నిర్లక్ష్యం, నిరంకుశత్వ ధోరణిని నిరసిస్తూ వైఎస్ఆర్‌సిపి బిసి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్‌గౌడ్, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న అనంతపురం జిల్లా కేంద్రలో లలిత కళా పరిషత్‌లో బిసి గళం సభ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్ర మా నికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డా.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజర వుతారని, కదిరి నియోజకవర్గం నుంచి కాక సత్యసాయి జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, నాయకులు, మేధావులు హాజరై సభను విజ యవంతం చేయాలని కోరారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైం దన్నారు. బిసిలకు 50 సంవత్సరాలు నిండిన వారికి రూ.4వేలు ఇస్తామన్న హామీ, బిసి సబ్‌ప్లాన్‌కింద లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్న హామీని నేటి వరకు అమలు చేయలేదన్నారు. బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ సభల్లో 33 శాతం రిజర్వే షన్లు కల్పిస్తామని మాటలు చెప్పారు తప్పా అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇంత వరకు రిజర్వేషన్లు అమలు చేయ లేదన్నారు. 24 నెలల కాలంలో కూట మిప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. బిసిలు బ్యాక వర్డ్ క్యాస్ట్ కాదని, బ్యాక్ బోన్ క్యాస్ట్‌ని నిరూపించిన ఘనత దివంగత నేత డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి దక్కిందన్నారు. ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్.జగన్ హయాంలో 2019 నుంచి 2024 వరకు బిసిలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వారి అభివృద్ధికి కృషి చేశారన్నారు. పాల ఏకరికి, పత్రికులస్తులకు ఓసి నుంచి బిసి ఎ లోకి, ముస్లింలకు 4 శాతం రిజర్వే షన్లు కలి ్పం చిన ఘనత రాజ శేఖర్‌రెడ్డిదే అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం వైసిపి హయాంలో జరిగి ందన్నారు. ఆదివారం అనం తపురంలో జరిగే బిసి గళం సభకు కూటమి ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ పాలనపై గళం విప్పాలని ఆయన కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



డా.బత్తల హరి ప్రసాద్

# సీఎం, కిలారి రాజేష్‌లను కలిసిన మీడియా కోఆర్డినేటర్ బి వి.వెంకటరాముడు

## - పార్టీ వాయిస్‌ను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న బాబు

అనంతపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త బ్యూరో

తెలుగుదేశం పార్టీ స్టేట్ మీడియా కోఆర్డినేటర్‌గా నియమితులైన బీవీ వెంకటరాముడు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఉండవల్లి నివాస ంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం ఆయ నను అభినందిస్తూ... పార్టీ వాయిస్, కూటమి ప్రభుత్వ విజయాలను బలం గా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వేగవంతంగా పార్టీ కార్యక్రమాల సమాచారాన్ని ఎప్పటి కప్పుడు మీడియాకు అందించాలని అన్నారు. ఆ తర్వాత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారి రాజేష్ ను కలిసి ఆయన ఆశీస్సు లు తీసుకున్నారు.

గతంలో వస్తున్నా మీ కోసం, యువగళం పాద యాత్రకు మీడియా కోఆర్డినేటర్ గా బి వి.వెంకటరాముడు అందించిన సేవలను కిలారి రాజేష్ అభినం దించారు. నేటి సోషల్ మీడియా యుగంలో నిజం గడప దాటే లోపు అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వస్తోంది, అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని రాజేష్ అన్నారు. రాముడు మాట్లాడుతూ... గతంలో తనకున్న అనుభవాన్ని ఉపయోగించి శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు.



సీఎం, కిలారి రాజేష్‌లను కలిసిన బి వి.వెంకట రాముడు.. దృశ్యాలు



# వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మహర్దశ

## - భక్తుల సౌకర్యార్థం రూ.2.5 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జె.సి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

పెద్దపప్పూరు మండలం తిమ్మనచెరువు గ్రామ సమీపంలో కొండపై వెలసిన వజ్రగిరి లక్ష్మీనరసిం హస్వామి ఆలయానికి మహర్దశ చేకూరనుంది. తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డిలు ఆలయ అభివృద్ధి పను లకు శ్రీకారం చుట్టి పనులను వేగవంతం చేశారు.

జూటూరు గ్రామం నుండి తిమ్మనచెరువు వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి కొండ వరకు 2.50 కోట్లతో నిర్మించిన బిటి రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ఆవిష్కరించి అనంతరం రిబ్బన్ కట్ చేసి రోడ్డును ప్రారంభిం చారు. భక్తుల సహకార ంతో ఆలయంలో కల్యాణ మండపం పనులు చేపడు తున్నారు. తాడిపత్రి నియోజకవర్గాన్ని టెంపుల్ సిటీ ఆఫ్ రాయలసీమగా ఏర్పాటు చేయాలన్న మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంతో పాటు వజ్రగిరి లక్ష్మీనరసి ంహస్వామి ఆలయానికి అన్ని సౌకర్యాలతో పనులు చేపడుతున్నారు.

# రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ ఫుట్ బాల్ టోర్నమెంట్

## ఈనెల 28 నుండి 30వ తేదీ వరకు - జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్

అనంతపురము కలెక్టరేట్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త

రాష్ట్రస్థాయి శాప్ లీగ్ ఫుట్ బాల్ టోర్నమెంట్ 2026ను ఈనెల ఏప్రిల్ 28 నుండి 30వ తేదీ వరకు అనంతపురం జిల్లా కేంద్రంలో ఆర్డిటి స్టేడియం నందు నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను జిల్లా సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ ఫుట్బాల్ టోర్నమెంట్ 2026 నిర్వహణపై అధికారులతో జాయి ంట్ కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ ఫుట్ బాల్ క్రీడా పోటీలలో అండర్ 15 మరియు అండర్ 21 బాలురు మరియు బాలికలకు పోటీలు నిర్వహిస్తారని, సుమారు 2000 మంది క్రీడాకారులు పాల్గొంటారని, ఇందులో 28 జిల్లాల నుండి ప్రాతిని ధ్యం ఉంటుందని, ప్రతి జిల్లా నుండి 72 మంది వరకు క్రీడాకారులు పాల్గొంటారని, సదరు క్రీడా పోటీల నిర్వహణ ఆర్డిటి స్టేడియం నందు గల మూడు గ్రౌండ్లలో నిర్వహిం చబడునని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి మంజుల, కడప స్పోర్ట్స్ స్కూల్ కో ఆర్డినేటర్ మరియు స్పెషల్ ఆఫీసర్ జగన్నాథ్ రెడ్డి, ఆన్ సెట్ శ్రీనివాస్, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

# పుట్టపర్తి సమీపంలో కారు ఢీకొని ఇద్దరు మృతి

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి పట్టణ సమీపంలోని పోలీస్ గ్రౌండ్ వద్ద కారు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. పుట్టపర్తి అర్బన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం 7:00 సమయంలో వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన మారుతి, ప్రసాద్ అనే వ్యక్తులు పని ముగించుకొని సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా తెలంగాణ రిజిస్ట్రేషన్ కలిగిన కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసం కాగా మారుతి, ప్రసాద్ లు అక్కడికక్కడే మృతి చెందారు. పెద్ద కమ్మవారి పల్లి గ్రామానికి చెందిన ఓ యువతి కారులో వేగంగా వెళుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా ఈ ప్రమాదం జరిగినట్టు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు నిలపకుండా వెళ్లిపోగా సూపర్ స్పెషా లిటీ ఆసుపత్రి సమీ పంలో కారును స్వాధీనం చేసుకు న్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పెనుకొండ ప్రభుత్వ ఆసు పత్రికి తరలిం చారు. మృతుడు ప్రసాద్ కు భార్య ముగ్గురు పిల్లలు ఉండగా, మారుతికి భార్య కలరు.





ప్రమాదంలో మృతి చెందిన మారుతి, ప్రసాద్

# గ్రామ కార్యదర్శి ఉత్తమ అవార్డు



ఎమ్మెల్యే సింధూర రెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు అందుకున్న విజయ్,

నల్లచెరువు ఏప్రిల్ 24 ప్రభాతవార్త, మండల పరిధిలోని అల్లు గుండు గ్రామానికి పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్న విజయ్ కుమార్ ఉత్తమ కార్యదర్శిగా అవార్డు అందుకున్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పుట్టపర్తి కలెక్టర్ వారి కార్యాలయంలో కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ అవార్డు స్వీకరణతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ కృషి చేస్తామని పేర్కొన్నారు. తోటి ఉద్యోగులు మండల ప్రజలు కార్యదర్శి విజయ్ కి అభినందనలు తెలియజేశారు

# 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## - ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజినేయులు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎఐటియుసి నాయకులు

కదిరి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ఈ నెల 26, 27, 28 తేదీల్లో తిరుపతి నగరంలో జరుగుతున్న ఏఐటి యుసి రాష్ట్ర మహా సభలో కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజినేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో కలిసి మహా సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లు, ఆశా, అంగన్వాడి, మధ్యాహ్న, భోజనం, మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సి ంగ్ ఉద్యోగుల సమస్యలను అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి దాదాపు 2 సంవత్సరాలు కావస్తున్నా ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. వీరిసమస్యలపై మహా సభల్లో చర్చించి సమస్యలపరిష్కారం కోసం భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు సూరి, జిల్లా కోశాధికారి నాగరాజు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు రాజా, గంగాద్రి, కృష్ణ ప్రసాద్‌లు పాల్గొన్నారు.